


# శబరితో

*

శ్రీ పోలుకొండ భద్రయ్య

*



(అంకితం: రాలిపోయిన మల్లెమొగ్గకు—)

ఆఖరికి నాకో సిగరెట్టయినా పీల్చే అలవాటు లేదు. కాని అన్నింటికంటే గొప్పనిషా ఒకటి నన్ను పట్టుకుంది. అది యెంకిపాటల నిషా—ఉదయాస్తమానాలూ, ఆ నిషాలోనే మునిగి వుంటూంటే, కాలచక్రం మాత్రం తనపని తాను చేసుకుని పోతూండేది.

"ఎంకి వొంటి పిల్ల లేదోయి—లేదోయి, యెంకి నా వొంకింక రాదోయి—రాదోయి"—అనే పల్లవి అందుకుని కొంత ఆలాపన చేసి విడిచేనా అంటే, నన్ను నే మరచిపోయేవాణ్ణి. నా హృదయవీణ మాత్రం, నాకు తెలీకుండానే, తనపని తాను చేసుకుంటూండేది. ఇల్లా చెప్పేనని, నన్ను వట్టి పాటలరాయుడనుకోవద్దు, ఇప్పుడు నేను మదరాసులో బి. ఏ. జూనియరుక్లాసు చదువుతున్నాను. మా కాలేజీకి నాదికూడా క్లవర్ హెడ్ అనిపేరు. అసలు మాది పడమటి గోదావరి జిల్లాలో, పాలకొల్లుదగ్గర చిన్నగ్రామం. మా తాత వైదికంవల్లనే యాభైయకరాల కొబ్బెరతోట-పాతికెకరాలవరి, భూమీ, సంపాదించాడు. ఆ భూవసతే ఇప్పుడు మా తండ్రిగారు వైదికవృత్తిని కాదనటానికి కారణ మయ్యింది. ఇప్పుడు మేమొక సంపన్న గృహస్తులం. ఇప్పుడు, మా తండ్రి, నలుగురుపాలేళ్ళూ—పదికాళ్ళ దుక్కిటెడ్లూ—రెండుబర్లూ-చాలా మోజుగా వ్యవసాయం సాగిస్తున్నాడు మా యింట్లో సంధ్యావందనంతో పాటు, వ్యవసాయ పరిజ్ఞానంకూడా అలవాటై పోయింది. నాకు మదరాసు చదువుకు కావలసిన సొమ్ము ఎప్పటికప్పుడు మా నాన్నగారు పంపిస్తూంటారు.

కేవలం క్లాసుపుస్తకాలే, ప్రపంచంలా, వల్లె వేసేరకపు విద్యార్థినిగాను నేను. అన్నివుద్యమాల సంగతులూ, తిరగవేస్తూంటాను. హిందూసంఘ సంస్కారానికి జరిపే ప్రతీప్రయత్నమూ, నాకు ఆనందంగానే వుంటూంటుంది. తరుచు అడయారు దివ్యజ్ఞానసమాజం చర్చలకు వెళుతూండేవాడిని. మదరాసులో జరిగే, ప్రముఖుల వుపన్యాసాల్లో సాధారణంగా నేను వినకుండా దాటిపోయిం దొక్కటీ లేదని చెప్పగలను. మదరాసు సంస్కర్తలూ—నాయకులూ—చాలామందితో నాకు పరిచయం గలిగింది. చదివిచదివీ, తిరిగితిరిగి, ఏలాగైతే నామనస్సుకి బాగా పట్టించుకుందీ,—నా అన్నీ పోయినాసరే, నేను విడువననుకుందీ, ఒక గట్టి అభిప్రాయం నాలో యేర్పడ్డది.

"—మనదేశాన్ని యీ కులభేదాలే, కొంప ముంచినాయనీ, దేశసౌభాగ్యానికి అడ్డు దగిలినాయనీ-"

౨

కాలేజీకి వేసవి కోసం సెలవులిచ్చారు. ఉత్సాహంగా యింటికొచ్చాను. అవి చైత్ర వైశాఖాలు, వసంతోదయంకాగానే పల్లెటూళ్ళకు శోభ అతిశయిస్తుంది. మా గ్రామంలోని వృక్షాలన్నీ నవపల్లవ శోభితంగా వున్నాయి. సమీపాన్నున్న చెట్టుమీద, మాటిమాటికీ మధుర గానం జేస్తూన్న కోయిల — తన్ను మించిన కంఠంతో ప్రతి గానం జేస్తూన్న మాలపిల్లను— తన ప్రియురాలిగా భావించుకొని గాబోలు, రెట్టించిన తమకంతో 'కుహూకుహూ' అనడం వినిఆందించిచేవాణ్ణి. చదువు హెచ్చైన కొద్దీ, వినయం చూపించే మంచి విద్యార్థిలాగ, ఫల భారాన్ని! నేలకు వంగివున్న, మామిళ్ళు నేత్రపర్వంగా వుండేవి. మొత్తం మీద వసంతుడు పల్లెటూళ్ళ వాళ్ళకు దగ్గర చుట్టంలా తోచేవాడు నాకు.

మొన్నటివరకూ, మదరాసు వింతలుచూచి చూచీ కాయలు గాచిన నా కళ్ళూ, గ్రామఫోను పాటలు వినివినీ చెవుడెక్కిన నా చెవులూ—పట్టణంలో మురుగుడు కంపుకు చెడిపోయిన నా ముక్కూ — ఈ పల్లెటూరి ప్రకృతి సంపద అనుభవిస్తూ, హాయిగా వున్నాయి. ఎంతో సంతోషంతో సెలవురోజులు గడిచి పోతున్నాయి. ఎప్పుడూ సెలవులయితే ఎంతో బాగుండేదిగదా! అనుకునే వాణ్ణి.

"ఈవేళ కొన్ని కోర్టు గొడవ లున్నాయి. నాలుగయిదు రోజుల వరకూ బస్తీలోనే వుండాలసి వస్తుంది. సాయంకాల మప్పుడల్లా మన తోటకే వెళ్ళి కూలీలను కాస్త హెచ్చరించి వస్తూండరా శంకరం!" అన్నారు మానాయనా వేళ. 'సరే' అన్నాను.

సాయంత్రం నాలుగున్నర గంటలు. క్రాపు దువ్వాను, స్నోట్సు పెట్టాను. తెల్లని బెంగాలీ ధోవతి కట్టాను. షర్టుతొడిగాను. ఉత్తరీయం పైన వేసుకున్నాను. యెంకి పాటల పుస్తకం చేత పట్టుకున్నాను. పొలానికి బయలుదేరాను. సమీపాన్నే లేత పచ్చిక మీద పురుగులనే తింటూ—చెంగు చెంగున దుముకుతూ—కువకువమంటూ ప్రణయ నృత్యం జేస్తూన్న, పావురాల జంటను చూచేసరికి పరమానందం గలిగింది నాకు. ఆవల మా చెరువుదగ్గర 'కారెం'దొక్కుతూ, పాటల బాడుదుతూన్నారు కలకంఠంతో మాల పడుచులు. వాళ్ల గానంతో మేళవించిన పిల్లగాలి కెరటాలు, నాకు సుస్వాగత మిచ్చినట్టయింది. కొంచెం దూరం నడచి మా కొబ్బరితోట చెరువుదగ్గర చేరుకున్నాను.

"నీకు నాకూ జోడుఅయితే — మల్లెపూలా తెప్పగట్టి—తెప్పమీదా తేలిపోతము గదరా—చల్ మోహనరంగా— పదరా — బందారు పోదాము; గదరా—"

సరిగ్గా, నేను వెళ్ళేసరికి ఈ పాటే తరచితరచి పాడుతున్నారు కూలి యువతులు. పాటవినేసరికి నా శరీరమంతా మత్తెక్కి పోయింది. హృదయం కలగిపోయింది. నాగస్వరపు పాటకు కోడె త్రాచు లా, వినివిని నన్ను నే మరచి, దగ్గరనున్న నిమ్మచెట్టు దగ్గర ఉత్తరీయం క్రిందబడేసి, చదికిలబడ్డాను. ఏదోఅపూర్వమైన భావోద్వేగంచేత, చెప్పరాని ఆనందంలో మునిగిపోయాను. ఇంకా రెట్టించిన తమకంతో కూలి యువతులు పాడుతూనే యున్నారు. చుట్టూ వున్నవాతావరణమంతా ఈ గాన తరంగాలకు ఘూర్ణిల్లిపోతూంది. ప్రతీ అణువూ, ఈ గానామృతం త్రాగి మత్తెక్కిపోతుందేమో, అనిపించింది నాకు. కొంతసేపటికి మించిన ఉత్సాహంతో తల పైకెత్తి చూచాను. పదహారేళ్ళ మాలపిల్ల—

"మన యిద్దరీ మన సొక్కటైతే—" అని పాడుతూ,పాడుతూ, తటాలున నావంక జూచింది. సిగ్గు దొంతరల భారంచేత, ఆమె నున్నని చామనచాయ చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. మొగం క్రిందకు వంచేసుకుంది. ఆమె చూపులు, మానవ నిర్మితాలయిన, కపట అడ్డంకుల నన్నిటినీ భేదించుకుని, నా హృదయంలోకంటా దూసుకపోయాయి. ఇల్లాగె చాల్లా సేపు, తన దొంగ చూపుల్లో నన్ను ముంచేసుకుంది. ఇంక నేనేమో, ఊహాలోకంలో విహారం ప్రారంభించాను.

3

ఎండదెబ్బకు వాడిపోయిన, ఆ విశాలనేత్రాలూ, అట్టే సంస్కారం లేక పోవటంచేత, అంతగా నునుపు లేకపోయినా — నీటినాచులా మెరుస్తోన్న, ఆపొడుగాటి: వాలుజడా—వేడిగాడ్పులకి కంది, వాడిపోయిన లేత గులాబీరంగుతోవున్న, చెక్కిళ్లూ, వింతవింత నగ

లేమీలేకుండానే, రెండుచేతులకీ, రెండు మట్టిగాజులూ, తెల్లముతుకచీరా, పొట్టిచేతుల చిన్నరవికా, ధరించి వున్న ఆ సహజశృంగారమూ, గండుకోయిల్లా తన పాటల తియ్యదనం, తనకే తెలీని, ముగ్ధహృదయముతో పాడుతూన్న, ఆకంఠధ్వనీ, మాల కులానికేగాక, అన్ని కులాలవాళ్ళకికూడా, వన్నె తేగలిగే ఆచూపులూ—నా హృదయంలో ముద్రితమై పోయినాయి.

ఆయమ్మాయికి కొంచెం సాయంజేసి, నాగరికతా ప్రపంచంలోకి, దారిజూపిస్తే, సౌందర్యరాశీ, సుగుణరాశీ కాగలదని నాకు తోచింది. ఎందరో అందకత్తెలయిన మాలపిల్లలు, నీచకులంలో పుట్టారనే పేరుతో వాళ్లని దరిజేరనీయక మంచిచెడ్డలుచెప్పక, బూడిద పాలచేస్తున్నారు గదా, అని విచారమేసింది. ఆమె పేరు వూరులు, పుట్టుపూర్వోత్తరాలూ, తెలిసికోవాలని, బుద్ధిపుట్టింది. వాకబుచేసి గ్రహించాను.

"వెంకటేశు మా మాలపల్లి కంతకీ, పెద్దమాలట.ఏదో ఒకజత ఎడ్లను సంపాదించుకుని,ఒక కాడి వ్యవసాయం చేసుకుంటూ, జీవనం చేస్తూన్నాడట. అయిదా రెకరాల భూమి, మా నాయనగారి దగ్గరనే కౌలుకు దీసికుని వ్యంచేస్తూన్నాడట. తీరిక సమయాల్లో వాళ్ళింటెల్లపాదీ మాపొలంలోనే, పనిపాటలుచేసికొని గోడుగానే బ్రదుకుతున్నారట.

'మాలయినా, మంచి మర్యాదల్లోనూ, శుచి శుభ్రాల్లోనూ, లోటుంచడు వెంకటేశు అని అప్పుడప్పుడూ మా నాన్నగారనడం, చాలాసార్లు నేను వినేవాణ్ణి. వెంకటేశు ప్రతిరోజూ ఉదయాన్ని స్నానంజేసి, బొట్టుపెట్టుకుంటేనేగాని భోజనంచేయడట. ఎత్తుపాటి మనిషి. ఎత్తుకుతగ్గలావు. పెద్దజుట్టు, తెల్లని మీసాలు, చామనచాయ శరీరం అతణ్ణి ఎరగనివాళ్లెవళ్ళూ, మాలని పోల్చుకోలేరు. ఆతనిభార్య ఆరంజోతికూడా, అతనికి తగిందే. కొంచెం రూపవతి అనే చెప్పొచ్చు.

వెంకటేశు తన బిడ్డలనందరినీ, కొంచెం నాగరికతగానే పెంచాట్ట. మాలపల్లిలోవున్నా క్రీస్తుస్కూల్లో అయిదో క్లాసువరకూ చదివించాట్ట. ప్రతిరోజూ వాళ్ళ వీధి అరుగుమీద కూర్చుని, కాలజ్ఞానతత్వాలూ, రామదాసుకీర్తనలూ పాడుతూ వుంటాడట. రామాయణం, భారతం కథలన్నీ నోటితో చెప్పెయ్యగలడట. తన పిల్లలికందరకూ, ఎన్నోకథలూ, పాటలూ, నేర్పినాడట.

వెంకటేశుకు ఇద్దిరి కుమాళ్ళ తర్వాత ఆఖరు ఆడుబిడ్డ శబరిదేవట. ఒక్కతే ఆడపిల్ల గనుక, అతి గారాబంగా పెంచుతున్నారట. అందరి మాలపిల్లలల్లే కూలినాలికి పంపరట. మా నాయనకూ, వాళ్లనాయనకూ వున్న జోస్తినిబట్టి, వాళ్లపొలంలో పనులన్నీ ముగించుకోగా వున్నతీరిక సమయంలో, మాపొలంలో పనికే పంపిస్తుంటారట. అయిదో క్లాసువరకూ చదువుకొన్నదట. ఈ ఏడూ, నిరుడూకూడా శబరికోసం చాలా కిరస్తానీ సంబంధాలు వచ్చాయట. తండ్రికి హిందూమతమంటే అభిమానమవటంవల్ల, మతమంటే గిట్టక వాళ్లనంతా నిరసిస్తూన్నాడట. విద్యాబుద్ధులు గలిగి, చుట్టా, త్రాగుడూ, దురభ్యాసాలూ, లేని ఏమాలకేనా సరే, యిస్తానంటున్నాడట. శబరిది కూడా అదే అభిప్రాయమట. తన తనయ విధేయతల వల్ల గూడెంలోవున్న మాలలందరికీ, శబరీదేవంటే ఎంతో గౌరవమట. మాలగూడెంలో, అశుభ్రంగా వున్నవాళ్ల నందరినీ, తరుచు శబరిమందలిస్తూ వుంటుందట. తెల్లటి ముతకచీరలు తప్ప,రంగురంగుల బట్టలూ, ఇత్తడి పుత్తడినగలూ, పూసాపేరూ యేమీ ధరించదట. ఎంతో ఆలోచనా, పట్టుదలా, నెమ్మదీ, గలిగి వుంటుందట: "రాచోరింట బుట్టవలసిన మనశబరి, మన అదృష్టంవల్ల మన కొంపలో పడ్డాది" అని చెప్పుకుని అప్పుడప్పుడు ఆరంజోతీ వెంకటేశులు, ఆనందిస్తూ వుంటార"ట.

౪

నేనిక శబరి ధ్యానంలో మునిగిపొయ్యాను. అస్తమానమూ, అదే ఆలోచన. ఈయాలోచనలో ఎన్నో సూర్యోదయాస్తమానాలు, నాకు తెలీకుండానే జారిపోయినాయి. ప్రతిరోజూ, నేను ఎక్కడో ఒకచోట శబరీదర్శనం చేస్తూనే వుండేవాణ్ణి. ఆనందం నాలో వెల్లువగట్టి పారుతూనేవుండేది. నాకు సెలవు రోజులుకూడా ఆఖరుగా వచ్చాయి. మాయింట్లో నా మదరాసు ప్రయాణానికి కావలసిందంతా, సిద్ధంజేసి వేశారు. తెల్లవారే ప్రయాణం.

ఆనాడు, విన్నబోయిన నా ముఖంలాగే ప్రతి వస్తువూ తేజోవిహీనంగా కనుపించింది. నిన్నటివరకూ ఆనందంగావున్న ప్రకృతి, నాకీరోజున విచార సూచకంగా కనుపించింది. శబరీ ప్రసన్న వదనబింబానికి, దూరమై పోతున్నానే, అనే ఆవేదన నాహృదయాన్ని కలచివేసింది. సాయంకాలం 5-గంటలు కావచ్చింది. లోకబాంధవుడు తన తీవ్రకిరణాన్ని చాలామట్టుకు ఉపసంహారించేసుకున్నాడు. చల్లని పిల్లగాలులు నామొగం మీద ముత్యాల స్వేదబిందువుల్ని హరించివేశాయి. ఆఖరుసారి మాకొబ్బరితోట చూచివద్దామని బయలుదేరాను.

అర్థం తెలీని అనేక ఊహాంతరంగాల్లో వుక్కిరిబిక్కిరిగా వుంది నామనని. ఏమో, హృదయం చిందరవందరగా, పలుదారుల పరుగెడుతోంది. ఆకాశవీధుల్లో సౌధాలు నిర్మించుకుంటూ, మాతోటలోకి వచ్చాను. వెనక, కణ్వాశ్రమంలో జరిగిన శకుంతలా దుష్యంతుల సమాగమ వృత్తాంతం, ఛప్పున స్ఫురణకు వచ్చింది. ఆశాహృదయంతో, ముందుకు మా పూలమొక్కల కేసి చూచాను. శబరి, బుంగ చంకబెట్టుకుని మెల్లగా నడుస్తూ, మాపూలమొక్కలకు నీళ్లుపోస్తుంది. పిల్లగాలికి మాచెరువులో కదులుతూన్న, నల్లకలువల్లాగ చలిస్తూన్న కళ్లతో, హఠాత్తుగా నన్ను చూచింది. తనలాగే అవికూడా, అందంగా వున్నందుకు అసూయ జెందిగాబోలు, పూలతీగలకి అతిచురుగ్గా నీళ్లు పోయడం ప్రారంభించింది. నేనిక చెప్పలేని ఆనందంతో దగ్గిరకు వెళ్ళాను. గగుర్పాటు చెందిన నాశరీరంలో ప్రతి రక్తబిందువూ, అపూర్వమైన ఆనందంతో, నాట్యంచేయ మొదలెట్టింది. ఇక నేనామెను పలుకరించకుండా, వుండలేక పోయాను.

"పిల్లా, నీపేరేమిటి?"

సిగ్గు చేత తలవంచేసుకుని, బుంగ క్రిందబెట్టి, దగ్గరగావున్న కొబ్బరిచెట్టుదగ్గర నిలబడింది; ఉబికి వస్తూన్న ఉత్సాహం కొద్దీ, మళ్లీ, - "నీపేరు మేం వినగూడదా?" అన్నాను.

తల కొంచెం పైకెత్తి, చిరునవ్వునవ్వుతూ, మెల్లగా "శబరి అంటారని తెలీదా?" అంది చమత్కారంగా- లేనికోపం నటిస్తూ,—

"ఓహో, వెనక ప్రేమమూర్తి శ్రీరాముడికి, అరణ్యంలో ఎంగిలి పండ్లను ఉభయ మిచ్చిన శబరీదేవి అపరావతారానివా? అల్లాగైతే నీవుకూడా నీ మధురాధరామృతం, ఏ ప్రేమమూర్తికేనా, సమర్పించి సార్థక నామం చేసుకోరాదా" అన్నా నవ్వుతూను.

"ముట్టరాని మాలపడుచుకి, అంత అదృష్టమా" అంది ఆనందంగా.

"శబరీ? మన తోటలో మాల పాలేళ్లు పెంచిన, గులాబీచెట్ల పూవుల్ని, ఈ బ్రాహ్మణులంతా "మాలలు పెంచిన పూలా; యితర కులాలవాళ్లు పెంచిన పూలా" అని ఆలోచించకుండానే, వాటి సౌందర్యానికీ, పరిమళానికీ ఆనందించడం లేదూ, అల్లాగే సుందర మయ్యిందీ, పవిత్ర మయ్యిందీ, ప్రేమపాత్ర మయ్యిందీ, ఎక్కడవున్నా సరే గ్రహించడం, మానవ లోకానికి సహజగుణం. ముఖ్యంగా ఈ నవయుగపు ధర్మం—" అన్నా గంభిరంగా. "ఏమో, ఈ పెద్ద కులాలవాళ్లకి దయాదాక్షిణ్యాలుండవు. కులము పేరున, మామంచి చెడ్డలన్నీ మంట గలుపుతూంటారు. మిమ్మల్ని మాత్రం యెల్లా నమ్మేదీ, మీ—."

ఇంకా యేమో అనబోతుంది, శబరి, తీవ్రంగా- "చూడు, శబరీ! పొద్దు కూకుతూంది. అట్టే స్వగతులు మాట్లాడటానికి యిప్పుడు కాలం చాలదు. మన స్నేహితం, ఈ కొద్దికాలంలోనే, గట్టిగా పెనవేసుకపోయాయి. నీ హృదయం నేను చూచాను. నీ వినయ విధేయతలూ, తెలివి తేటలూ, నాకు నచ్చాయి. నేను ఈ విషయంలో నా తలిదండ్రుల్నీ, బంధువుల్నీ—వెనుకటి ఆచారాల్నీ, లెఖజేసే వాడను గాను. ఏమైనా సరే నీవే నా ప్రియురాలివి. నామీదికి ఒక్క బ్రాహ్మణ సంఘమే గాదు, ప్రపంచమంతా ఏకమై వచ్చినా, నిన్ను నేను విడిచిపెట్టను. నా గృహారాజ్యానికి నిన్నే నిజమయిన రాణీని చేస్తాను. నిన్ను ఏ ముహూర్తాన జూచేనో, అప్పుడే, ఎవ్వరి సాయమూ, అక్కర్లేకుండానే, నాకు నేనే, ఈ సంఘ బంధాలన్నీ నరికేసి, నిన్ను నాదాన్నిగా జేసేసుకున్నాను.

నీవుగాక, ఇంకెల్లాంటి అందగత్తెనే సరే ఎందరు పెద్దలూ, పురోహితులూ, కలిసి, మేళతాళాలతో,

మంత్ర తంత్రాలతో, నాదాన్ని చేయాలని చూచినా ఇక నేనంగీకరించను. ముమ్మాటికీ నీవేనా ప్రాణానివి. నీవే నాకు నిజంగా కావలిసిన దానివి. రేపే నేను మద్రాసు వెళ్ళాలి. నీవు ఈరాత్రి కోడికూతవేళ లేచి, యెవ్వరికి తెలియకుండా, ఈతోటలోకివచ్చి వుండు. మన మిద్దరమూ కలిసి, మదరాసు వెళదాము. ఏమీ భయంలేదు. తప్పక రావాలి. నీవు మోసం జేశావా అంటే నేను నా జీవితాంతమూ, పెండ్లి జేసుకోకుండానే వుండి పోతాను. తెలుసా మరి? నీ అభిప్రాయం నాకు జెప్పవూ, చేతిలో చేయివేయవూ—" అన్నా తత్తర పాటుతో.

"తప్పకవస్తా—తప్పకవస్తా"—అంటూ నాదగ్గర కంటూ వచ్చి, వణుకుతూన్న తనచేయి, నాచేతిలో వేసింది. ఇంక నాచేతులు నాకు తెలీకుండానే, ఆమెను పెనవేసుకున్నాయి. నా బాహుబంధంలో ఆమె నడుము బిగిసిపోయింది. ఆమె అరుణాధరం మీద నా ముద్దులవర్షము కురిసింది. ఇల్లా కొన్ని నిముసాలు, ఒకరి చేతుల్లో ఒకళ్ళం, వళ్లు మరచి ఉండిపోయాము. ఇంతలో దూరాన్నుంచి, మా పని వాడెవ్వడో వస్తూన్న చప్పుడయ్యింది. నా శబరి కొంచెం వెనక్కి జరిగింది. కందిపోయిన కపోలాల్ని, వీడిపోయిన వేణీభరాన్నీ, సవరించుకుంటూ, నవ్వుతూ, నాకళ్లల్లోకి చూచింది.

"ఇకచాలా, వెళ్ళొచ్చా" అందినను సిగ్గుతో- "సరే, తప్పకరావాలి" అన్నా వుత్సాహంగా. "సరే, సరే" అంటూ, రివ్వున కారుమేఘాల్లో, మెరపు తీగలా పరుగెత్తింతి యింటివైపుకి నేనిక హృదయ భారంతగ్గి, ఇంటికెళ్ళాను.

౫

మదరాసుమెయిలు బహు వేగంగా పరుగెడు తూంది. ఎప్పుడూ పల్లె విడిచి ఎరుగని నాశబరి, మొగమంతా కళ్ళుచేసుకుని, రైలు కిటికీలంట, నూతన ప్రపంచాన్ని చూస్తుంది. నవనాగరికతను, మూల మూలలకీ మోసుకపోతూన్న, రైల్లో అడుగు బెట్టగానే, నాశబరికి వింతసోయగం, గలిగింది. మధ్యమధ్య చిలుక పలుకుల్లా, తానుజూచే వింతల్నిగురించి నన్ను అడిచేది. ఆమేకు తెలిసేటట్టు జవాబులు చెప్పేవాణ్ణి. చూచే కొద్దీ ఆమెలో వింతశోభ కనుపించేదినాకు. ఆనిర్మల సౌందర్యామృతాన్ని, నారెండు కళ్లతోటీ జుర్రుకునే వాణ్ణి. రైలు మదరాసు సెంట్రల్ స్టేషనులో ఆగింది. మేము నిర్భయంగా రైలుదిగి సరాసరి నామకాంలో జేరుకున్నాము. సెంటుసబ్బుతో శబరిని, స్నానము చేయించాను. సన్నని ఖద్దరుదుస్తులు కట్టించాను. హోటల్‌నుంచి వచ్చిన, మధురాహారాన్ని మేమిద్ద రమూ తిన్నాము. విశాలఫాలాన్ని చిన్నికుంకుమ బొట్టు మెరుస్తోంది. సహజ శృంగారవతి శబరి; వశిష్ఠుడి ప్రక్కన అరుంధతిలా మెరుస్తోంది. వెంటబెట్టుకుని పట్టణంలోవున్న ప్రముఖులందరి దగ్గరకూ, తీసికెళ్ళాను. శబరిని చూపించి నిజవృత్తాంతమంతాంత నిష్కపటంగా వారికి చెప్పివేశాను. నా సంస్కరణాభిలాషా,మా ప్రేమా, వారిదగ్గర వెళ్ల బుచ్చాను. మదరాసు సంస్కర్త లందరూ, నా పట్టుదలకూ, అభిప్రాయానికీ, సంతసించారు. సంస్కార్తల పరిచయ భాగ్యమూరికే పోతుందీ—

ఆ మరునాడు మదరాసునుంచి పబ్లిషు అయ్యే పత్రికల్లో, ఇల్లా ప్రకటించబడ్డది.

"శబరీ శంకరకల్యాణ మహోత్సవాహ్వానము.

వరుడు:—ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ వైదిక బ్రాహ్మణ కుటుంబమునకు జెంది, విద్యాధికుడైన శంకరరావు—

వధువు:—గౌరవ హరిజన కుటుంబమునకు చెంది తగు విద్యా, గుణ, వయో, రూపసంపదలుగలిగిన శబరీదేవి-

తెలుగుదేశంలో, శ్రీ, శ్రీ, వీరేశలింగపంతులు, శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగు సంస్కర్తల తీవ్ర ప్రబోధములకు ఫలితంగా—ఈనెల 25వ తేదీ సాయంత్రం 5½-గంటలకు, మదరాసు రామ మోహన బ్రహ్మమందిరంలో, ఈఅంతర్వర్ణ వివాహము జరుపనిశ్చయించినాము. అభిమానులెల్లరు విచ్చేసి, వధూవరుల నాశీర్వదించ వేడుచున్నాము.

—ఇట్లు మదరాసు సంస్కరణ సంఘం"

౬

ఇరువై అయిదోతేదీ 5½-గంటలకు, అత్యల్ప మయిన అలంకారాలతో, నేనూ నాశబరీ, రామ మోహన బ్రహ్మమందిరంలో సిద్ధమయ్యాము. మద

రాసులోనూ—ఆంధ్రదేశంలోనూ వున్న సుప్రసిద్ధ సంస్కర్త లందరూ, విచ్చేశారు. ఈ విద్ధూరం చూడ్డానికి చాలామంది ప్రజలు కూడా వచ్చారు. హాలంతా నిండిపోయింది. సనాతన ధర్మవాదులు, ఒక ప్రక్కనుంచి, శాపనాకారాలను గురిపిస్తూనే యున్నారు. చక్కని తెలుగు మంత్రాలతో, వివిధమతస్థుల ప్రార్థనలతో, కొంచెంకొంచెం టీనీళ్ళతో, వివాహ విధి నిర్విఘ్నంగా సాగిపోయింది. నా మిత్రులు కొందరు, నా యపూర్వ సంస్కరణకు వేనోళ్ళ పొగుడుతూ, అభినందనాలూ—ఆశీర్వాద రత్నాలు చదివారు. భారత దేశమంతటినుంచీ అనేకులు ఆశీర్వాదాలూ—సందేశాలు పంపించారు. అవన్నీ వివాహానంతరం జరిగిన బహిరంగ సభలో చదువబడ్డాయి. పలువురు పెద్దలు అంతర్వర్ణ వివాహాలను ప్రోత్సహిస్తూ, గంభీరోపన్యాసాలు చేశారు. అప్పటినుంచీ నా మకాము మదరాసులోనే.

మొట్టమొదట నా తలిదండ్రులు, నే చేసిన ఈ వర్ణ సంకరానికి, నాలుకలు పీక్కుని చావసిద్ధమయ్యారు. ఎల్లాగో తుదకు ప్రాణాలు నిలుపుకున్నారు. నేను నా తలిదండ్రులకి ఒక్కడే కుమారుడిని కావటంచేత, అప్పటప్పటా రహస్యంగా వచ్చి చూచి పోతూనే వుంటారు. నాకు కావలసిన డబ్బు పంపిస్తూనే వుంటారు.

ఆమధ్య పూర్వాచార పరాయణులూ—పీఠాధిపతులూ కలిసి, ఏవో ఆంక్షపత్రికలంటూ, జారీ జేయబోయారట. కాని ఆదెబ్బ నాకేమీ తగల్లేదు. అంతకుముందే నేను వాళ్ళనందర్నీ ఆంక్ష చేసి కూర్చున్నాగా!

ఇప్పటివరకూ నేనూ—నా శబరీ చిలుకా గోరువంకల్లా కాపురం చేస్తున్నాము. ఆమె నిత్యజీవితానికి, నేను మంచి ఉపాధ్యాయుణ్ణయి సవరించాను. మాలో ఒకళ్ల మీద ఒకళ్లకు, ఏవిధమయిన, అధికారాలూ లేకుండా, నిజమయిన స్నేహితులల్లే బ్రతుకుతున్నాము. శబరికోసం, నేనూ, నా కోసం నా శబరీ బ్రతుకుతున్నాము, శబరి హృదయిం నాది, నా హృదయం శబరిదీ. కారణాంతరాలవల్ల నేనూ, నా శబరీ విడిపోవలసి వచ్చినా, భయం లేదన్నంత ధైర్యం చిక్కింది మాకిప్పుడు. ప్రమాదవశాన్ని మాలో ఏవొక్కరమేనా పొరపాటుచేస్తే, ఒకళ్ళనొకళ్ళం కన్నీళ్ళతో దిద్దుకుంటూంటాము. ఎప్పుడేనా మృత్యుదేవత అంటూ వచ్చినా, మాలో ఒకళ్ళను విడిచి, ఒకళ్ళను తీసుకపోవడం, దానికీ కూడా చేతగాదేమో, అనుకుంటూంటాను. నేనెంత పనిపట్టి చూచినా, శబరిలో మాలతనమేమీ కనబడటం లేదు.

ఏబ్రాహ్మణ యువతికీ, తీసుకట్టుగాని ఆచారాలూ—అలవాట్లూ, గలిగించుకుంది నా శబరి. ఇప్పుడు నా ముద్దుల శబరికి, చక్కని దేశభక్తీ, త్యాగశీలత, అలవడ్డాయి. మాలపిల్లని, చేపట్టినందుకు నాకే విధమయిన, శరీర మనో దార్ఢ్యాలూ తగ్గలేదు కూడాను, ఇప్పుడు నా జీవితము మధుర గీతంలా సాగి పోతూంది శబరితో.—

